క్లుప్తంగా

నేడు హుండీల ఆదాయం లెక్కింపు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారి హుండీ కానుకలు గురువారం లెక్కించనున్నామని ఈఓ పి.శ్యామలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో లెక్కించనున్న ఈ కార్యక్రమానికి భక్తులు హాజరు కావాలని కోరారు.

ఆధార్ కేంద్రం సేవల పరిశీలన



కోమటిపల్లి సచివాలయంలో ఆధార్ సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటిపల్లి సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలోని సేవలను ఎంపీడీఓ పి.రవికుమార్ బుధవారం పరిశీలించారు. కృష్ణాపురం, కలవరాయి గ్రామాల్లో బుధవారం పర్యటించిన ఆయన ఆయా గ్రామ సచివాలయాల్లోని పీ 4 సర్వేపై సమాచారాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోమటిపల్లి సచివాలయంలోని ఆధార్ కేంద్రంలో సిబ్బంది సేవలను పరిశీలించారు. అంగన్‌వాడీ చిన్నారులకు ఆధార్ గుర్తింపు, పెద్దల ఆధార్ సవరణలను ఇక్కడ ఉచితంగానే చేస్తారని గ్రామాల్లో ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

నేటి నుంచి అంగన్‌వాడీలకు శిక్షణ

బాడంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజుల పాటు శిక్షణ నిర్వహించనున్నట్టు ఐసీడీఎస్ పీఓ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం ఆమె మట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తరపున నవచేతన-ఆదర్శ్‌ల (పోషన్‌భీ-పఢాయిభీ)పై శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణకు తెర్లాం, బాడంగి మండలంలోని కార్యకర్తలతో పాటు రామభద్రాపురం మండలంలోని 18 మంది కార్యకర్తల హాజరు కావాలని కోరారు.

ఆర్థిక సాయం



వాసుకు సాయం అందజేస్తున్న దాతలు

సంతకవిటి: సత్యసాయి సేవాసమితి, సంతకవిటి యూత్ ఫ్రెండ్స్ అసోసియేషన్(సైఫా) సంయుక్తంగా తమ ఔదార్యాన్ని చాటుకున్నాయి. మండల కేంద్రంలో ఇటీవల పక్షవాతానికి గురై మంచానికే పరిమితం కావడంతో తన ఇంటికి వెళ్లి రూ.22,500ల ఆర్థిక సాయంతో పాటు, కుటుంబానికి నెలకు సరిపడ సరుకులను బుధవారం అందించారు. వాసుకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం స్వామినాయుడు

రేగిడి: మహిళా సంఘాల్లోని రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని విజయనగరం అడిషనల్ డీపీఎం స్వామినాయుడు సూచించారు. మండల కేంద్రంలో ఐకేపీ కార్యాలయంలో స్వయంశక్తి సంఘాల మహిళలు, ప్రకృతి వ్యవసాయం సిబ్బందితో అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. మహిళలు ఇంటి వద్ద పెరటితోటలు పెట్టి, ఇంటికి అవసరమైన కూరగాయలు పండించుకోవడం, మహిళా రైతులు పొలాల్లో ఎరువుల వినియోగానికి చెక్‌పెట్టి, సేంద్రియ సాగు చేయడం చేయాలని అన్నారు. కార్యక్రమంలో కృష్ణప్రసాద్, ఎస్ఎఫ్ఎంటీ బి.పద్మ, ఏసీ చిరంజీవి, ఏపీఎం గోవిందరావు, సీసీలు, సీఏఫ్‌లు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై తస్మాత్..

రామభద్రపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీఓ రత్నం అన్నారు. మండలంలోని కొట్టక్కి సచివాలయంతో పాటు అక్కడ అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం తనిఖీ చేశారు. రికార్డులతో పాటు పరిసరాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వండుతున్న వంటలను పరిశీలించి రుచి చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణుల, బాలింతలు, చిన్నారుల పోషక లోపాన్ని అధిగమించేందుకు సంపూర్ణ పౌష్టికాహారం అందించాలన్నారు. రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఎదుగుదల లేని పిల్లలను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.



ఏడు మండలాలకు ఒకటే శకటం

రాజాం:

వేసవికాలం వచ్చిందంటే చాలు ఇటు ఎండ తీవ్రత, అటు వడగాల్పులు, మరో వైపు అగ్ని ప్రమాదాలు. గతంలో ప్రతీ గ్రామంలో పూరిళ్లు, పశువుల పాకలు ఉండడంతో ఈ ప్రమాదాలు అధికంగా ఉండేవి. లక్షలాది రూపాయల్లో ఆస్తినష్టమే కాకుండా పలుచోట్ల ప్రాణ నష్టం ఉండేది. ఇప్పుడు పూరిళ్లు, పశువుల తాటాకు పాకలు తగ్గుముఖం పట్టినా ప్రమాదాల సంఖ్య మాత్రమే అలానే కొనసాగుతోంది. గతంలో గ్రామాల్లో జరిగే అగ్ని ప్రమాదాలు ఇప్పుడు పొలాల్లో, గ్యాస్ వినియోగంలో జరుగుతున్నాయి.

సగటున 58కి పైగా ప్రమాదాలు

గత ఐదేళ్లలో ప్రతీ ఏడాది రాజాం సర్కిల్ పరిధిలో సగటున 58కి పైగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒక్కో ఏడాది వీటి సంఖ్య 70 వరకూ చేరుతోంది. ఈ ప్రమాదాలు ఎక్కువగా వేసవిలో జరుగుతుండడం గమనార్హం. ఇందులో పంట పొలాలు తగలబడడం, వరిచేను కుప్పలు, గడ్డివాముల ప్రమాదాలు, చెరకు పంటలు, సరుగుడు తోటలు అగ్నికి ఆహుతవ్వడం ఎక్కువగా ఉంటున్నాయి. ఇవే కాకుండా గ్రామాలు, పట్టణాల్లో గ్యాస్ సిలిండర్ల లీకులు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ మంటలు వంటి ప్రమాదాలు నమోదవుతున్నాయని సిబ్బంది వెల్లడిస్తున్నారు. వీటితో పాటు జాతరలు, పెళ్లిల్లు, యాత్రల సమయంలో బాణసంచా నిల్వ ఉంచడం, వాటిని కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడం ప్రమాదాలకు ఆస్కారమిస్తుంది. గ్రామాల్లో, పట్టణాల్లో ముందస్తుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, గత కొన్నేళ్లుగా ప్రమాదాల సంఖ్య ఏడాదికి 58 నుంచి 70 మధ్య నమోదవుతూ వస్తున్నట్లు అగ్నిమాపక శాఖ తెలిపింది.

ఒక్క డ్రైవర్‌తోనే సేవలు

రాజాం క్లస్టర్ పరిధిలో ఏడు మండలాలకు రాజాం అగ్నిమాపక కేంద్రమే సేవలు అందించాలి. గత ప్రభుత్వం రాజాం అగ్నిమాపక కేంద్రానికి కొత్త వాహనాన్ని అందించింది. అంతకు ముందు పాత వాహనంతో సేవలు అందించేవారు. ఈ కేంద్రంలో మొత్తం 18 మంది సిబ్బంది సేవలు అందిస్తుండగా, ఇందులో వాహన డ్రైవర్ మాత్రం రెగ్యులర్ విధానంలో ఒకరే ఉన్నారు. ముగ్గురు డ్రైవర్లు ఈ వాహన సేవలో ఉండాల్సి ఉండగా, ఒకరు మాత్రమే అందిస్తున్నారు. ఇంకొకరిని డెప్యుటేషన్ మీద ఇక్కడకు తీసుకురాగా, మరొకరు హోంగార్డు విధానంలో డ్రైవర్‌గా చేరారు. హోంగార్డు డ్రైవర్ ప్రస్తుతం సెలవుల్లో ఉంటున్నారు. రాజాంతో పాటు రేగిడి, వంగర, సంతకవిటి, జి.సిగడాం, తెర్లాం, బలిజిపేట మండలాల్లోని ప్రజలకు ఈ ఒక్క శకటం ద్వారానే సేవలు అందించాలి. బలిజిపేట, తెర్లాం, వంగర, జి.సిగడాం మండలాల్లో శివారు గ్రామాలు ఈ కేంద్రానికి చాలా దూరంగా ఉన్నాయి. అక్కడకు ఈ శకటం చేరుకునే సమయానికి జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఈ శకటం ద్వారా 4500 గేలరీల నీటిని తరలించవచ్చు. 80 నుంచి 120 మీటర్ల దూరంలో ఉన్న మంటలను కూడా ఈ శకటం ద్వారా నిలువరించేందుకు వీలుంది.

జాగ్రత్తలతోనే నివారణ



అగ్నిప్రమాదాల నివారణ జాగ్రత్తలతోనే సాధ్యం. ప్రధానంగా విద్యుత్ తీగలు కింద వరిచేను కుప్పలు లేకుండా చూడడం, పంట పొలాల్లో వరిగడ్డి వాములు, చేను కుప్పలకు రక్షణ ఏర్పాటు చేసుకోవడం, గ్రామాల్లో గ్యాస్ వినియోగంపై అవగాహన పెంపొందించుకోవడం, బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించడం చేయాలి. ఏడు మండలాలకు రాజాం నుంచే అగ్నిమాపక శకటం వెళ్లాల్సి ఉంది. సిబ్బంది పూర్తి స్థాయిలో ఉన్నప్పటికీ ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రమాద తీవ్రత ఆధారంగా అదనపు సిబ్బంది అవసరం పడుతోంది.

– టీఎస్ఎస్ జనార్దనరావు, ఫైర్ సర్వీస్ ఎస్ఐ, రాజాం

వచ్చే ఏడాది మే నెలకు భోజరాజపురం వంతెన పూర్తి

- రూ.5 కోట్ల పనులు పూర్తి, రూ.2 కోట్ల బిల్లులు చెల్లింపు
- పీఆర్ జేఈ రుక్మాంగద నాయుడు



మున్సిపల్ స్థలాన్ని పరిశీలిస్తున్న పీఆర్, మున్సిపల్ అధికారులు, పాలకవర్గం

బొబ్బిలి: మండలంలోని భోజరాజపురం సమీపంలోని పట్టణ తాగునీటి రిజర్వాయర్ వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు వచ్చే ఏడాది మే నెల నాటికి పూర్తయ్యే అవకాశాలున్నాయని పంచాయతీరాజ్ జేఈ రుక్మాంగద నాయుడు అన్నారు. బుధవారం వంతెన నిర్మాణ పనులను పరిశీలించేందుకు వచ్చిన ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రూ.15 కోట్లతో నిర్మాణం ప్రారంభించిన ఈ వంతెన నిర్మాణ పనులు రూ.5 కోట్ల మేర వ్యయం చేసి పిల్లర్ల వరకూ చేపట్టినట్టు చెప్పారు. ఈ పనులకు 2023లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2 కోట్ల చెల్లింపులు చేసిందన్నారు. కాంటెల్ సిండికేట్ సంస్థ చేపడుతున్న ఈ నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. మొత్తం రెండు కిలోమీటర్ల మేర వంతెన, రెండు వైపులా అప్రోచ్ రోడ్డు పనులు చేపడతామన్నారు. వంతెనకు గొర్లె సీతారామపురం జంక్షన్ వరకూ అప్రోచ్ రోడ్డు ఉంటుందన్నారు. రామభద్రపురం మండలం నాయుడువలస వరకూ మరో అప్రోచ్ రోడ్డు నిర్మాణం ఉంటుందన్నారు. ప్రస్తుతం బిల్లుల కోసం ఎదురు చూస్తున్నట్టు చెప్పారు.

వంతెన రోడ్డుకు 8 సెంట్ల మున్సిపల్ స్థలం

భోజరాజపురం వద్ద నిర్మిస్తున్న వంతెన నిర్మాణంలో చివరి భాగం, అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్‌కు సంబంధించిన ప్రహరీ, గేటు వైపు గల 8 సెంట్ల మున్సిపల్ స్థలం అవసరం పడుతుందని జేఈ రుక్మాంగద నాయుడు మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, కమిషనర్ ఎల్.రామలక్ష్మి, కౌన్సిల్ సభ్యులకు తెలిపారు. బుధవారం ఉమ్మడిగా స్థల పరిశీలన చేశారు. బ్రిడ్జి నిర్మాణం, అప్రోచ్ రోడ్డు కోసం అవసరమయిన స్థలాన్ని కొలిచి గుర్తించారు. ఇందుకోసం అక్కడి ప్రహరీ, గేటు, ట్రాన్స్ ఫార్మర్‌లను తొలగించి వేరే చోట ఏర్పాటు చేయాల్సి ఉందని నిర్ణయించారు. ఈ ఏర్పాట్ల కోసం పీఆర్, విద్యుత్ శాఖ అధికారులకు ప్రతిపాదించాల్సి ఉందన్నారు. పూర్తి ప్రతిపాదన వివరాలను మాకు సమర్పిస్తే కౌన్సిల్‌లో పెట్టి ఆమోదించే నిర్ణయం తీసుకుంటామని చైర్మన్, కమిషనర్లు తెలిపారు. వైస్ చైర్మన్లు చెలికాని మురళీకృష్ణ, రమాదేవి, కౌన్సిల్ సభ్యులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఇంత మోసమా!



తాను తీసుకున్న ఆర్టీసీ టిక్కెట్‌ను చూపెడుతున్న విద్యార్థి చరణ్

రామభద్రపురం: కూటమి ప్రభుత్వం టెన్త్ పరీక్షల వేళ విద్యార్థులను మోసం చేస్తోంది. టెన్త్ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు హాల్‌టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఉచితమని పదేపదే చెప్పింది. తీరా ఆర్టీసీలో ప్రయాణం చేస్తే కొందరి విద్యార్థుల దగ్గర టిక్కెట్లు వసూలు చేశారు. మండలంలోని మర్రివలసకు చెందిన పదో తరగతి విద్యార్థి పట్నాన చరణ్ మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్ష రాసేందుకు బస్సెక్కాడు. అయితే మీకు ఉచితమని మాకు ఎటువంటి ఆదేశాలు రాలేదని, టిక్కెట్ తీసుకోవాల్సిందేనని కండక్టర్ చెప్పడంతో తప్పనిసరై టిక్కెట్ తీసుకున్నాడు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

రాజాం: మండలంలో కంచరాం వీపీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ యాగాటి దుర్గారావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థుల హాజరు శాతంపై ఆరా తీసారు. అనంతరం రికార్డులు నిర్వహణ, మధ్యాహ్నభోజన పథకం అమలు తదితర అంశాలు పరిశీలించి, హెచ్ఎం భవానికి నూతన బోధన పద్ధతుల అమలుపై అవగాహన కల్పించారు.

చిన్నారుల ఆరోగ్యంపై అప్రమత్తం

రేగిడి: చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారిని సోహినీరాఘవ్ అన్నారు. బుధవారం మండలంలో అంబఖండి, సోమరాజుపేట గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వేస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. సీహెచ్ఓ సుందరేశ్వరరావు, సూపర్‌వైజర్ అప్పారావు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రం పరిశీలన

బాడంగి: మండల కేంద్రంలోని హైస్కూల్, గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రాలను ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈఓ లక్ష్మణదొర బుధవారం సందర్శించారు. పరీక్ష కేంద్రంలో మౌలిక సదుపాయాలు చూసుకోవాలని సూచించారు.

రాజాం: రాజాంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను ఎంఈఓ యాగాటి దుర్గారావు బుధవారం పరిశీలించారు. వరలక్ష్మి సెయింటాన్స్ కేంద్రం వద్ద పరీక్షల నిర్వహణపై ఆరా తీశారు.

రెడ్‌జోన్‌లో వీధి వ్యాపారాలు నిషేధం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం సిటీ: పట్టణంలో పెరుగుతున్న రద్దీ దృష్ట్యా రెడ్ జోన్‌లో వీధి వ్యాపారాలు నిషేధించామని కమిషనర్ జె.రామప్పలనాయుడు సూచించారు. స్థానిక కార్యాలయంలో వీధి వ్యాపారులు, బ్యాంకు ఉద్యోగులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా వ్యాపారులకు అనువుగా మూడు జోన్లు ఏర్పాటు చేశామని అన్నారు. అంబేడ్కర్ కూడలి, బొబ్బిలి జంక్షన్‌లను రెడ్‌జోన్లుగా పరిగణించామని అన్నారు. ఈ జోన్‌ల పరిధిలో ఎటువంటి వ్యాపారాలకు అనుమతి లేదని తెలిపారు. అంబేడ్కర్ కూడలిలో నాలుగు రోడ్లు, బొబ్బిలి జంక్షన్‌లో మూడు రోడ్లు పరిధిలో పరిమితిలు విధించామని అన్నారు. అంబేడ్కర్ జంక్షన్ నుంచి శ్రీనివాసా టాకీస్ రోడ్డులో సారథి జంక్షన్ వరకు, శ్రీకాకుళం రోడ్డులో పెట్రోల్‌బంకు వరకు, పాలకొండ రోడ్డులో జేజే హోటల్, మెయిన్ రోడ్డులో స్కూల్ గేటు వరకు, అలాగే బొబ్బిలి జంక్షన్‌లో మూడు వైపులా 50 మీటర్ల పొడవునా రెడ్‌జోన్‌గా నిర్ధారించామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఎటువంటి వీధి వ్యాపారాలు చేయవద్దని సూచించారు. అలాగే అంబర్ జోన్‌గా నిర్ణయించిన పాఠశాల, దేవాలయాలు, హాస్పటల్స్, ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిర్దిష్టమైన ట్రాఫిక్ లేని సమయంలో మాత్రమే వ్యాపారాలు చేయాలన్నారు. అలాగే మిగతా ప్రదేశమంతా గ్రీన్‌జోన్‌గా కేటాయించామని, ఈ విషయాన్ని వీధి వ్యాపారులంతా గుర్తించి అధికారులకు, ప్రజలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్, టీపీఓ తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నీటి చౌర్యాన్ని అడ్డుకునేందుకు నిఘా



వేగావతి నదిలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు, పాలకపక్ష సభ్యులు

బొబ్బిలి: పట్టణంలోని రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తున్నప్పటికీ ఇళ్ల ముందర కొందరు సంపులు నిర్మించుకుని మోటార్ల ద్వారా నిల్వ చేసుకుని దుర్వినియోగం చేస్తున్నారని, దీనిని పూర్తిగా అరికట్టేందుకు కమిటీలు వేసి నిత్యం పర్యటించి వారిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, కమిషనర్ ఎల్.రామలక్ష్మి, ఇంజనీరింగ్ అధికారులు, పాలక సభ్యులు స్పష్టం చేశారు. బుధవారం పట్టణ తాగునీటి సరఫరా ప్రధాన కేంద్రాన్ని పాలకపక్షం, అధికారులు క్షేత్ర పర్యటన చేశారు. నదిలో నీటి నిల్వలను, అక్కడ నిర్మించిన ఇన్‌ఫిల్టరేషన్ బావులను పరిశీలించారు. అక్కడి సమస్యలను గుర్తించారు. అనంతరం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్, కమిషనర్లు మాట్లాడుతూ పట్టణంలోని తాగునీటి సరఫరా పైప్‌లైన్లు, ప్రధాన పైప్‌లైన్ సహా పాతతరానికి చెందినవి కావడంతో చాలా చోట్ల లీకులు వస్తూ పంపింగ్ చేస్తున్న నీటిలో పదిశాతం వృథా అవుతున్నాయని గుర్తించామన్నారు. ప్రస్తుతం లీకులు ఎక్కువగా వస్తున్న చోట పైప్‌లైన్లు మార్చుతామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కూడా తరచూ మొరాయిస్తున్నందున కొత్తది కొనుగోలు చేశామని, దానిని వెంటనే అమర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా కొంతమంది పట్టణ వాసులు తమ ఇంటిముందు చిన్న సంప్‌లు నిర్మించుకుని తాగునీటిని అందులో పట్టుకుని అక్కడి నుంచి మోటార్ల ద్వారా ట్యాంకులకు ఎక్కించి నిల్వ చేస్తున్నట్టు గుర్తించామన్నారు.

అటువంటి వాటని అరికట్టేందుకు కమిటీలు నియమించి వారి ద్వారా అధికారులు, సిబ్బందితో నిత్యం నిఘా పెట్టి మోటార్లను సీజ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఒక్కో వార్డులో తాగునీరు ఎక్కువ సేపు వస్తే కొన్ని వార్డుల్లో తక్కువ సమయంలోనే సరఫరా నిలిపివేస్తున్నారని, సిబ్బంది చాలకపోవడం కూడా ఓ సమస్య ఉందని గుర్తించారు. వీటిని అరికట్టేందుకు కొత్తగా నీటిసరఫరా విభాగంలో సిబ్బందిని నియమించేందుకు కౌన్సిల్ ముందుంచుతామన్నారు. పంప్ హౌస్‌లోని ప్యానల్స్‌ను అవసరాన్ని బట్టి మార్పు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు చెలికాని మురళీ కృష్ణ, రమాదేవి, ఇంజనీరింగ్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వేసవితాపం.. పుచ్చకాయతో మటుమాయం



రాజాంలో కంచరాం రోడ్డులో రోడ్డు పక్కనే పుచ్చకాయల వ్యాపారం

రాజాం: వేసవిరానే వచ్చింది. భానుడి భగభగలు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఎండ తీవ్రత తగ్గడంలేదు. ఈ క్రమంలో పాదచారులకు, ప్రయాణికులకు పట్టణంలోని ప్రధాన రోడ్లపై తోపుడుబండ్లతో పాటు దారి మధ్యలో రహదారి పక్కన పుచ్చకాయల స్టాల్స్ బాగా ఉపయోగపడుతున్నాయి. వేసవి తాపం నుంచి సేదతీరేందుకు తక్కువ డబ్బులతో అటు శరీరానికి ఉపయోగపడడమే కాకుండా, మంచి శక్తినిచ్చే ఆహారంగా పుచ్చకాయలు వినియోగపడుతున్నాయి. వేసవి ఎండకు అలసిపోయిన ప్రయాణికులకు నేనున్నానంటూ పుచ్చకాయలు ఎదురొస్తున్నాయి. రాజాం పట్టణంతో పాటు రాజాం నుంచి పలు మండలాలకు వెళ్లే ప్రధాన రహదారుల పక్కన పుచ్చకాయల వ్యాపారాలు బాగా పెరిగాయి. రాజాం పట్టణంలో బొబ్బిలిరోడ్డు, శ్రీకాకుళం, పాలకొండ రోడ్డులలో వీటిని స్టాల్స్‌గా పెట్టి, పోగులుగా వేసి విక్రయిస్తున్నారు.

ఓటర్ల నమోదు సక్రమంగా జరగాలి



బీఎల్‌ఓల శిక్షణలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీను

బొబ్బిలి రూరల్: ఓటర్ల నమోదు ప్రక్రియలో బీఎల్‌ఓలు క్రియాశీలకంగా వ్యవహరించాలని, తప్పులు జరగకుండా చూడాలని తహసీల్దార్ ఎం.శ్రీను సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆవరణలో బుధవారం మండలంలోని బీఎల్‌ఓలకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు, ఇతర ప్రాంతాలకు వలస వె వెళ్లిన, వచ్చిన ఓటర్ల నమోదులో తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. ఓటర్ల నమోదులో ఆధార్ లింక్ చేయాల్సి ఉంటుందని వివరించారు. పేర్లు తప్పులు, మరణాల ఓటర్ల తొలగింపు, కొత్త ఓటర్ల చేర్పులు వెంటనే జరిగేలా పని చేయాలని సూచించారు. శిక్షణలో ఎన్నికల డీటీ బలివాడ గౌరీశంకర్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పూజా సామగ్రి విక్రయానికి వేలం ఖరారు



వేలంలో పాల్గొన్న పాటదారులు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ, జ్ఞానసరస్వతి దేవి ఆలయంలో పూజా సామగ్రి విక్రయానికి వేలం ఖరారైందని ఈఓ పి.శ్యామలరావు తెలిపారు. ఆలయ ఆవరణలో ప్రత్యేకాధికారి, పోలిపల్లి పైడితల్లి దేవాలయ ఈఓ బీవీ మాధవరావు సమక్షంలో బుధవారం నిర్వహించిన వేలంలో ఎనిమిది మంది వ్యక్తులు పాల్గొన్నారు. ఆలయం వద్ద పూజా సామగ్రి సెట్లు, పుస్తకాలు, రక్షాబంధనములు, అమ్మవారి లేమినేషన్ ఫొటోలు అమ్ముకునేందుకుగాను నిర్వహించారు. సంతకవిటి మండలం తలతంపర గ్రామానికి చెందిన రాగోలు ఆనందరావు 4.85 లక్షలకు అధిక మొత్తంలో వేలం పాడి కైవసం చేసుకున్నారు. గతం కంటే ఈ ఏడాది రూ.2.15 లక్షలు అదనంగా వచ్చిందని ఈఓ తెలిపారు. ఈ నెల 30 నుంచి 2027 మార్చి 29 వరకు విక్రయాల హక్కు కాల పరిమితి రెండేళ్ల పాటు ఉంటుందని పేర్కొన్నారు. పాటలో ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, పర్యవేక్షకులు కూరాడ వెంకటరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సూచించారు. రేగిడి మండలంలోని ఉణుకూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆయన బుధవారం పరిశీలించారు. నాణ్యతతో కూడిన వేడి పదార్థాలను వండి పెట్టాలని సూచించారు. అనంతరం విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు. – రేగిడి

క్యూ కట్టిన టెన్త్ విద్యార్థులు



రామభద్రపురం మండలంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రెండో రోజు బుధవారం హిందీ పరీక్ష రాసేందుకు పరీక్ష కేంద్రానికి వెళ్లే ఈ క్రమంలో క్యూ కట్టారు. పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఇక్కడ రెండు కేంద్రాల్లో 511 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 507 మంది హాజరయ్యారు. రెండు కేంద్రాల్లో నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈఓ తిరుమల ప్రసాద్ తెలిపారు. – రామభద్రపురం

సంక్షిప్తంగా...

ఘనంగా పూజలు

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామంలో వెలసిన శివ పంచాయతన ఆలయంలో బుధవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉమా కాశీ విశ్వేశ్వర పంచాయతన క్షేత్రంలో అంపోలు రుద్ర కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో శిష్య బృందం అంపోలు గోపాలకృష్ణశర్మ, అంపోలు రామ్‌ప్రసాద్‌శర్మ పర్యవేక్షణలో పూజలు జరిగాయి.

కొలతలు ప్రకారం పనులు

రాజాం సిటీ: ఉపాధి పనుల్లో వేతనదారులు కొలతల ప్రకారం పనులు చేయాలని ఏపీఓ కె.సాయిరాం సూచించారు. బుధవారం మండల పరిధి బొమ్మినాయుడువలసలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు.

బోర్లుకు మరమ్మతులు

వంగర: మండల పరిధి అరసాడ, నీలయ్యవలస గ్రామంలో నాలుగు తాగునీటి బోర్లు మరమ్మతులు చేపట్టారు. బుధవారం క్లాస్ ప్రోగ్రాంలో భాగంగా ఆయా గ్రామాల్లోని ఇటీవల మూలకు చేరిన బోర్లును మెకానిక్‌లు బాగుచేసి తాగునీటిని అందించారు.

క్లాస్‌తో బోర్ల మరమ్మతులు

రాజాం: మండలంలో తాగునీటి బోర్లకు క్లాస్ పోగ్రాం ద్వారా మరమ్మతులు చేయిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వి.జగన్మోహనరావు తెలిపారు. బుధవారం మండలంలో శ్యాంపురం, కొఠారిపురం గ్రామాల్లో తాగునీటి బోర్లను పరిశీలించడంతో పాటు అవసరమైన చోట మరమ్మతులు చేపట్టామని అన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం

తెర్లాం: క్షయ వ్యాధిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెర్లాం పీహెచ్‌సీ ఇన్‌చార్జ్ వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. 100రోజులు టీబీ కార్యక్రమంలో భాగంగా బుధవారం తెర్లాంలోని బీసీ కాలనీలో క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు.

చలివేంద్రం ప్రారంభం

తెర్లాం: మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రజల దాహార్తిని తీర్చేందుకు దోహదపడుతుందని ఎంపీడీఓ రేగి రాంబాబు అన్నారు. బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆయనతో పాటు ఈఓపీఆర్‌డీ నీలిమ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ముగిసిన పోలమ్మతల్లి పండగ

బాడంగి: మండల కేంద్రంలోని పోలమ్మతల్లి గ్రామదేవత పండగ బుధవారం అనుపోత్సవ వేడుకలతో ముగిసింది. మంగళవారం రాత్రి తిరువీధి చేసిన పోలమ్మతల్లి ఘటాలను చావిడి వద్ద ఉంచి బుధవారం ఉదయం ఉజ్జిడి బళ్లపై అంజలి రథాన్ని తిప్పి తిరిగి ఘటాలను ఊరేగించి అనుపోత్సవం నిర్వహించారు.